# రెడ్ షాడో 1




మధుబాబు

# రెడ్ షాడో

(షాడో స్పై ఎడ్వెంచర్)

రచన:

మధుబాబు

మధుబాబు పబ్లికేషన్స్

మాచవరం,

విజయవాడ – 520 004

# RED SHADOW

(Serialised in Swathi Weekly)

By

MADHU BAABU

© M.B. Publications

ఇందులోని పాత్రలు, ప్రదేశాలు, సన్నివేశాలు, సంఘటనలు కేవలం కల్పితాలు. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినవి కావు.

© Author

© Madhu Baabu

This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# ఒక్కమాట

షాడో సి.ఐ.బి.లో సీక్రెట్ ఏజెంట్‌గా చేరకముందు, దొంగతనాలు చేస్తూ నేరస్థుడిగా జీవితం గడుపుతున్నప్పటి కథల్లో ఇది ఒకటి.

ఇండియన్ స్పెషల్ బ్రాంచి తనను అరెస్ట్ చేయటానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభించబోతున్న సమయంలో, భారతదేశాన్ని వదిలి జపాన్ దేశానికి పారిపోయాడతను.

అక్కడ కుంగ్‌ఫూ విద్యాపీఠంలో చేరి విద్యాభ్యాసం చేస్తున్న తరుణంలో ఫ్యుజీశాన్ అనే కుంగ్‌ఫూ వస్తాదుతో తగాదా పడతాడు. తత్ఫలితంగా జపాన్ దేశంలో కూడా నిలబడటం కష్టం అవుతుంది.

తనకు సంబంధించని అనవసరమైన పనుల్లో వేళ్ళుపెట్టి, దారినపోయే కష్టాలనన్నింటినీ కోరికోరి తలమీదకి తెచ్చుకోవడం బాగా అలవాటు అతనికి.

అందుకే చైనాలో వున్న పటోలా బౌద్ధమత పీఠానికి వచ్చిన ఒకానొక ఆపదను కడతేర్చడం కోసం ఆవైపు ప్రయాణం చేశాడు.

తనకు తానుగా తలకు ఎత్తుకున్న ఆ కార్యాన్ని దిగ్విజయంగా నెరవేర్చిన తర్వాత ఒక పడవలో చైనాను వదిలి, కొరియా వైపు బయలుదేరాడు. చింజు పట్టణ పరిసరాల్లో బందిపోటు దొంగల దాష్టికానికి గురై అలమటించిపోతున్న ఆ ప్రజలను ఆదుకోవటానికి ప్రయత్నించి, అక్కడి పోలీసుల ఆగ్రహానికి గురయినాడు.

షాడో కథలను మొదటినుండి చదువుతున్న పాఠకులకు ఈ విషయాలన్నీ తెలుసు. చదవని పాఠకుల సౌలభ్యం కోసం ఈ అంశాలను ముందుగా వెల్లడిస్తే బాగుంటుందన్న అభిప్రాయంతో ఈ మాటలను వ్రాయడం జరిగింది.

దొంగగా జీవిస్తున్న రోజుల్లో గమ్యంలేని జీవితాన్ని గడిపాడు షాడో.

గాలి ఎటు వీస్తే అటు ప్రక్కకు తిరిగి, అడవులకు అడవుల్ని కాల్చుకు తినే కార్చిచ్చు మాదిరి తన దృష్టికి వచ్చిన అన్యాయాలను, అక్రమాలను ఎదుర్కొంటూ, ముందుకు సాగిపోవడమే ధ్యేయంగా పెట్టుకున్న మనిషి అతను.

ప్రాణంలో ప్రాణమైన తన స్నేహితుడు గంగారాంతో కలిసి అతను చింజు పట్టణం నుంచి పరుగు ప్రారంభించాడు.

ఎటు పోవాలో, ఎక్కడికి పోవాలో తెలియదు. వెనకనుండి వచ్చిపడుతున్న కొరియన్ పోలీసుల్ని తప్పించుకోవటమే ఆ సమయంలో అతను చేయవలసిన పని. ఇక్కడి నుండి ప్రారంభమయ్యే ఈ కథ మీకు నచ్చుతుందనే ఆశిస్తున్నాను.

**- మధుబాబు**

## మొదటి భాగం

"ఆకలి వేస్తోంది గురూ... అడుగులు తడబడిపోతున్నాయి" ఉన్నట్టుండి ఎనౌన్స్ చేశాడు గంగారామ్. ఎనౌన్స్ చేయటంతో ఆగలేదతను. చటుక్కున నేలమీద చతికిలబడి మోకాళ్ళ మీద తల ఆనించుకున్నాడు.

ఎగసుకువస్తున్న ఆయాసాన్ని అణుచుకోటానికి ప్రయత్నిస్తూ, చుట్టూ చూశాడు షాడో. మరో రెండు మూడు మైళ్ళు ప్రయాణం చేయగలిగితే అంతం అయిపోతుంది వారు అనుసరిస్తున్న మైదాన ప్రదేశం. దట్టమైన పొదలతో, ఎత్తయిన వృక్షాలతో కనుల పండువుగా అగుపిస్తోంది మైదానం ఆవలి ప్రక్కన వున్న అరణ్యం.

పట్టువదలని పెద్దపులుల్లా అదేపనిగా తరుముకు వస్తున్న కొరియన్ పోలీసుల్ని తప్పించుకోవాలంటే తాము ఆ అడవిలోకి ఎంటరయి తీరాలి.

ఆకలి ఆయాసాలకు భయపడి అక్కడే ఆగిపోతే నిట్ట నిలువుగా మునిగిపోతాయి కొంపలు. కొరియన్ పోలీసులకు పట్టుబడటం అంటూ జరిగితే జీవితాంతం జైళ్లలో మగ్గిపోవాల్సిందే.

“నీతో కలిసి ప్రయాణం చేయడం అంటే తిండి తిప్పలకు నీళ్ళు వదులుకోవడమే అని తెలిసి కూడా నీ వెంట ఎందుకు వస్తూ వుంటానో నాకు అర్థం కావడం లేదు. పూర్వజన్మలో ఏదో పెద్ద పాపం చేసికొని వుంటాను. అందుకే ఇలా అవస్థలు పడుతున్నాను” కచ్చ నిండిన కంఠంతో అంటూ మెల్లిగా లేచి ముందుకు అడుగులు వేశాడు గంగారాం. ఆ మాటలకు కూడా సమాధానం ఇవ్వలేదు షాడో.

ఎగుడు దిగుళ్ళు, ఎత్తు పల్లాలతో నిండివున్న ఆ మైదాన ప్రదేశంలో తమ వెహికిల్స్ వేగంగా ముందుకు సాగలేవని గ్రహించారు కాబోలు. కాలినడకనే ముందుకు పరిగెత్తుకు వస్తున్నారు కొరియన్ పోలీసులు.

శక్తివంతమైన బైనాక్యులర్స్ ద్వారా ఆవలి ప్రక్కన వున్న అడవిని గమనించి పెద్ద కంఠంతో అందరినీ హెచ్చరించాడు వారితో వచ్చిన ఒక అధికారి.

“దట్టమైన ఆ అడవిలోకి అడుగుపెట్టిన తర్వాత ఆ రాస్కెల్స్‌ని మనం బంధించలేము. మైదానంలో వుండగానే వారిని అడ్డుకోవాలి... పరిగెత్తండి అందరూ... వేగంగా పరుగుతీయండి...” అని అంటూ వారిని రెచ్చగొట్టాడు.

పట్టుబడాలన్న కోరిక లేకపోవడం వల్ల, శరీరంలో వున్న శక్తినంతా పాదాల్లోకి రప్పించుకుంటూ పరుగులు తీశాడు షాడో. అరగంట తరువాత అరణ్యపు అంచును సమీపించి ఒక్క క్షణం ఆగాడు.

అటవీ ప్రదేశాల్లో మాత్రమే లభించే అరుదయిన పుట్టతేనెను సేకరించటం కోసం ప్రొద్దుటనగా వెళ్ళిన గ్రామీణులు కొందరు, పొదల మధ్యలో నుంచి ఈవలికి రావటాన్ని గంగారాం గమనించాడు.

వచ్చీరాని కొరియన్ భాషలో వారిని కుశల ప్రశ్నలు వేసి, కడుపు నింపుకోవటానికి పనికివచ్చే పదార్థాలు ఏమయినా వారి దగ్గిర వున్నాయేమో ఎంక్వయిరీ చేశాడు గంగారాం.

“పోలీసులకు మస్కా కొట్టి ఈ మైదానంలోకి పారిపోయి వచ్చిన బందిపోటు దొంగల కోసం మేము కూడా ప్రయత్నం చేస్తున్నాము.

వేగంగా పరిగెత్తడంలో మా ఆహారపు సంచీ ఎక్కడో జారిపోయింది. ఆకలి దెబ్బకు కళ్ళు బైర్లు కమ్మేస్తున్నాయి” అంటూ తన గోడును వినయం నిండిన కంఠంతో వారికి వినిపించుకున్నాడు.

మైదానం మధ్య భాగంలోకి వచ్చివున్న పోలీసుల వంకా అతని వంకా మార్చి మార్చి చూస్తూ, చిన్నగా నవ్వేశాడు ఒక గ్రామీణుడు.

"ఎందుకు అలా నవ్వుతున్నావ్? నా మాటలు నీకు నవ్వు తెప్పిస్తున్నాయా?" కనుబొమలు ముడివేసి చూస్తూ కౄరంగా అడగబోయిన గంగారాం భుజం మీద వెంటనే చేయి వేసి బలంగా అదిమాడు షాడో.

"తాము చేయవలసిన పనుల్లో పరాయివారు చేతులు పెడితే చూసి వూరుకునేంతటి గొప్పవాళ్ళు కారు మా పోలీసులు.

తాము చేస్తున్న పనుల్ని మధ్యలోనే వదిలేసి, సహాయం చేయవచ్చిన వారిని స్టేషన్‌కి తీసుకుపోతారు" అంటూ తన భుజానికి ప్రేలాడుతున్న ఒక తాబేటికాయ వంటి వాటర్‌బేగ్‌ను గంగారాం చేతికి అందించాడు గ్రామీణుడు.

దుస్తుల్లో నుంచి ఎండిపోయిన రెండు రొట్టెల్ని తీసి అతని చేతిలో పెట్టాడు.

"పోలీసులు పరిగెత్తుకు వస్తోంది మనల్ని పట్టుకోవటానికేనని వీళ్ళకి తెలిసిపోయిందా?" ఎండు రొట్టెనొకదాన్ని

షాడో చేతికి ఇచ్చి, రెండో రొట్టెను ఆదరా బాదరాగా నములుతూ, లోగొంతుకతో షాడోని అడిగాడు గంగారాం.

అప్పుడు కూడా పెదవి విప్పలేదు షాడో. మైదానంలో వున్న పోలీసుల్ని ఓరకంట గమనించుకుంటూ, తనకు ఇవ్వబడిన రొట్టెను నమిలి మ్రింగేశాడు. తాబేటికాయవంటి వాటర్‌బేగ్‌లోని మంచినీటితో గొంతును తడుపుకుంటూ, గ్రామీణులకు అభివాదం చేశాడు.

"చైనా సముద్రం మీదుగా మా దేశం వచ్చిన ఇద్దరు విదేశీయుల మూలకంగా మమ్మల్ని పీడించుకు తింటున్న బందిపోట్లు అందరూ హతమారిపోయినట్లు మాకు తెలిసింది. ఆ విదేశీయులు మీరు కాదుగదా!" అతని ముఖంలోకే పట్టిపట్టి చూస్తూ ఫ్రాంక్‌గా అడిగాడు రొట్టెల్ని దానం చేసిన వ్యక్తి.

ఆ మాటలకు ఎటువంటి సమాధానం ఇస్తే బాగుంటుందోనని షాడో ఆలోచించటం మొదలుపెట్టకముందే, అతని భుజం మీద చేయి వేసి అడవి వేపు మృదువుగా నెట్టాడు మరో గ్రామీణుడు.

"మీరు ఎవరయినదీ మాకు చెప్పవలసిన అవసరం లేదు. మా రక్షకభటులు ఇక్కడికి వచ్చి మీ అంతు చూడకముందే

పారిపోవడం మంచిది... వెళ్ళిపోండి" ఆత్రుత నిండిన కంఠంతో హెచ్చరించాడు.

నాలుగే నాలుగు గుటకల్లో వాటర్‌బేగ్‌ని ఖాళీచేసి, వారందరికీ మరోసారి వినయపూర్వకంగా వందనం చేశాడు గంగారాం.

అడుగు ముందుకు వేయబోతుండగా, అప్పుడే ఏదో విషయం జ్ఞపికి వచ్చినట్లు అతని చేతిని పట్టుకొని ఆపాడు మరో గ్రామీణుడు.

"అడుగు పెట్టడానికి వీలుకానంత దట్టంగా వుండే ఈ అరణ్యంలో పోలీసులకు అగుపించకుండా మాయం అయిపోవటం ఏమంత కష్టమైన పనికాదు. కాని ఒక విషయం మీకు ముందుగానే చెప్పటం మంచిదని నా బుద్ధికి తోస్తోంది" అంటూ మిగిలిన వారివేపు చూశాడు.

అతను చెప్పదలుచుకున్న విషయం ఏదో చాలా ముఖ్యమైనదే నన్నట్లు వెంటనే తలలు ఊపారు వారందరూ.

"అరణ్యం మీదనే ఆధారపడి, బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా బ్రతికే అడవి గ్రామాలు అనేకం వున్నాయి ఇక్కడ... ఇప్పుడు మీరు మాతో ప్రవర్తించినట్లు సక్రమంగా సజావుగా

మర్యాదగా ప్రవర్తిస్తే మీకు ఆ గ్రామ ప్రజల వల్ల ఎటువంటి ఇబ్బందులు ఎదురుగావు.

అదేపనిగా ప్రయాణం చేయటం వల్ల కలిగిన అలసట మూలకంగా మాటలు తూలితే మాత్రం బహుప్రమాదం. వాడిగా వుండే బరిశెలతో మీ ప్రాణాన్ని బలిపుచ్చుకుంటారు'' గంగారాం ముఖంలోకి సూటిగా చూస్తూ వెల్లడించాడు ఆ వ్యక్తి.

మాట తూలే గుణం తనకు వున్నట్లుగా అతను సూచించటాన్ని గమనించి కనులు ఎర్రచేయబోయాడు గంగారాం. అంతలోనే షాడో తన పాదం మీద బూటుకాలితో బలంగా అదిమేసరికి తనను తాను కంట్రోల్ చేసుకొన్నాడు.

''అడవి గ్రామాలను దాటిన తరువాత మీకు కనిపిస్తుంది సముద్రం. ఎత్తయిన గుట్టలతో, నిలువుగా నిలబడి కనిపించే పర్వతాలతో, పచ్చటి వృక్షాలతో చూడముచ్చటగా వుండే ఆ ప్రదేశంలో మీకు ఒక షింటో ఆలయం కూడా అగుపిస్తుంది'' మైదానం మధ్యలో వున్న పోలీసుల్ని గమనించుకుంటూ త్వరత్వరగా చెప్పాడు ఆ గ్రామీణుడు.

''దైవం మీద మీకు భక్తి ప్రపత్తులు వుంటే, ఆ ఆలయంలోకి వెళ్ళి షింటోకి నమస్కరించుకోండి. మీ కష్టాలను తొలగించమని

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=1448](http://kinige.com/kbook.php?id=1448)**

* * *

**Read other books of Madhubabu @**

**[http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20](http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20)**